సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 19 । అక్టోబర్ । 2023



విలువిద్యలో క్రీడాకారుల ప్రతిభ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని క్రీడాకారులు విలువిద్యలో ప్రతిభ చూపుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. IIలో



నిరంతర నిఘా..

భద్రాచలంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల నియమావళి అమలుకు చర్యలు చేపడుతున్నారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 23°

గురువారం ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటగంటకూ ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీ



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

సుజాతనగర్: పలు ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ రాత పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ బుధవారం పరిశీలించారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్ష రాయాలని అభ్యర్థులకు సూచించారు. గురు, శుక్రవారాల్లో కూడా పరీక్షలు కొనసాగుతాయని, ఈ మేరకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కాగా, తొలిరోజు పరీక్షకు 136 మందికి గాను ఉదయం సెషన్‌లో 88 మంది, మధ్యాహ్నం 85 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

క్రీడాకారులకు ఎల్లవేళలా ప్రోత్సాహం



వెంకటప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడంలో పోలీసు శాఖ ముందుంటుందని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా వాసి వెంకటప్రసాద్, కోచ్ పెదపాటి కాశీహుస్సేన్ బుధవారం ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వెంకటప్రసాద్‌ను అభినందించి మాట్లాడుతూ యువత దుర్వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలు, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కాగా, ఈనెల 25వ తేదీ నుంచి గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్న వెంకటప్రసాద్ పతకం సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.మొగిలి, సీఈలు నాగరాజు, ఓ.సుధాకర్, వి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీని సందర్శించిన 'వ్యవసాయ' విద్యార్థులు




బ్యాంక్ లావాదేవీలను విద్యార్థులకు వివరిస్తున్న మేనేజర్ మణికంత

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖను స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. బ్యాంకుల సంస్థాగత నిర్మాణం, నగదు లావాదేవీలు, వడ్డీ చెల్లింపులు, స్వయం సహాయక సంఘాలకు అందించే గ్రూప్ రుణాలు, తిరిగి వసూలు చేసే విధానం, రైతుమిత్ర గ్రూపు రుణాలు వంటి వివరాలను బ్యాంకు మేనేజర్ మణికంఠను అడిగి తెలుసుకున్నారు. ఆయన చెబుతున్న విషయాలను విద్యార్థులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ ఐ.కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్ రాజకీయం!

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసుల్లో పార్టీ పనులు
- సీఎం కేసీఆర్ సభల నేపథ్యంలో అక్కడే హడావుడి
- పార్టీ జిల్లా కార్యాలయంలో మాత్రం కనిపించని కళ..
- అధికార పార్టీ వైఖరిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కొత్తగూడెం, ఇల్లెందులో జరిగిన గులాబీ పార్టీ కార్యక్రమాలను విపక్ష నేతలు వేలెత్తి చూపుతున్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో..

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 1న ఇల్లెందు, 5వ తేదీన కొత్తగూడెంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రెండు నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ అక్కడున్న అసమ్మతి నేతలను సముదాయించడంతో పాటు వివిధ వర్గాలుగా చీలిపోయిన నేతల మధ్య ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నారు. సీఎం సభాస్థలి అంశంపై కూడా క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికే అభ్యర్థుల ప్రకటన, బీ ఫామ్‌ల జారీతో గులాబీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

ఫిర్యాదుకు సిద్ధం..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయమైన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వేదికగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రతిపక్ష పార్టీల నాయకులు అంటున్నారు. ఇటీవల ప్రగతిభవన్ వేదికగా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీ ఫామ్‌లు అందివ్వడంపై ఆక్షేపణలు వచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. సీఎం పర్యటనకు మరో పది రోజులకు పైగా సమయం ఉండడంతో మరోసారి ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, క్యాంప్ ఆఫీసు పైఅంతస్తులో ఎమ్మెల్యేల నివాసం ఉన్నందున అక్కడ జరిగే సమావేశాలకు కోడ్ వర్తించదని గులాబీ శ్రేణులు అంటున్నాయి. ఈ అంశంపై జిల్లా అధికారులకు సైతం స్పష్టత కరువైంది.

వెలవెలబోతున్న జిల్లా కార్యాలయం

కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు సమీపంలోనే బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ఉంది. అక్కడ ప్రత్యేకంగా సమావేశ మందిరం కూడా ఉంది. ఎన్నికల వేడి రాజుకున్నా గులాబీ నేతలెవరూ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు వేదికగానే పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడం విమర్శలకు తావిస్తోంది. భారీ హంగులతో పార్టీ కార్యాలయం అందుబాటులోకి వచ్చినప్పటికీ, పార్టీ పరంగా దాన్ని ఉపయోగించుకోకపోవడం తమ పొరపాటేనంటూ ఆ పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా అంగీకరిస్తున్నారు.

కనిపించని రేగా..

సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రెండు బహిరంగ సభల షెడ్యూల్ ఖరారైనప్పటికీ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తరఫున ఎటువంటి కార్యాచరణ లేకపోవడాన్ని చూసి గులాబీ పార్టీ కార్యకర్తలే ముక్కున వేలేసుకుంటున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్ల పట్ల జిల్లా అధ్యక్షుడు అంటీముట్టనట్టుగా వ్యవహరించడాన్ని వారు తప్పుపడుతున్నారు.

అవి సొంత కార్యాలయాలా..?

సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లు, పార్టీ నేతల మధ్య సమన్వయం ఏర్పాటు వంటి అంశాల విషయంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వేదికగా చర్చలు, సమావేశాలు నిర్వహించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తప్పుపడుతున్నాయి. అవేమైనా సొంత కార్యాలయాలా అని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మంత్రి సత్యవతి రాథోడ్ నాయకత్వంలో ఇల్లెందు అసమ్మతి నేతలతో ముందుగా క్యాంప్ ఆఫీసు వెలుపల చర్చలు నిర్వహించారు. ఆ తర్వాత అసమ్మతి నేత డీవీని క్యాంపు ఆఫీసుకు తీసుకొచ్చి మరోసారి చర్చల కోసం ప్రయత్నించగా అసమ్మతి వర్గం నేతలు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఆ తర్వాత కొత్తగూడెంలో కూడా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వేదికగా మంగళవారం చర్చలు నిర్వహించారనే వార్తలు గుప్పుమన్నాయి.

కంచికి చేరని కా్మ్రేడ్స్ కథ!

- కాంగ్రెస్‌తో కొలిక్కి రాని పొత్తుల చర్చలు
- ఉమ్మడి జిల్లాలో సీట్ల కేటాయింపుపై తర్జనభర్జన
- కొత్తగూడెం, భద్రాచలం, పాలేరు స్థానాలపై ఎర్రజెండా దృష్టి
- సీపీఐకి 'గూడెం' కేటాయించేలా సూత్రప్రాయ అంగీకారం
- భద్రాచలంలో ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం, సీపీఐ అభ్యర్థులు బరిలో నిలిచే స్థానాలపై ఇంకా స్పష్టత రాలేదు. కామ్రేడ్లు పట్టుపడుతున్న స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కూడా బలంగా ఉండడంతో సీట్ల సర్దుబాటు వ్యవహారం తేలడం లేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య చర్చల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానాన్ని సీపీఐ, భద్రాచలం, పాలేరు స్థానాలను సీపీఎం కోరినట్లు తెలిసింది. ఇంతలోనే భద్రాచలం స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పేరును కాంగ్రెస్ ప్రకటించింది. ఇక కాంగ్రెస్‌లో ఖమ్మం సీటు తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన సీపీఎంకు ఎక్కడ కేటాయిస్తారు.. సీపీఐకి కొత్తగూడెం ఖరారవుతుందా.. అనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది.

ఉమ్మడి జిల్లాపై ప్రధాన దృష్టి

వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బరిలో నిలిచేందుకే ఉభయ కమ్యూనిస్టులు ఉత్సాహంగా ఉన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌తో, ప్రస్తుతం కాంగ్రెస్‌తో పొత్తులపై చర్చల సందర్భంగా సీపీఎం, సీపీఐ ఉమ్మడి జిల్లాలో రెండు, మూడు స్థానాలను ప్రస్తావించాయి. కాంగ్రెస్‌తో చర్చల నేపథ్యాన సీపీఐ కొత్తగూడెం, వైరా, సీపీఎం భద్రాచలం, పాలేరు స్థానాలను ప్రతిపాదించినా ఉమ్మడి జిల్లాలో మూడే జనరల్ స్థానాలు ఉండడం.. ఇందులో రెండింటిని కమ్యూనిస్టులకు కేటాయించేందుకు కాంగ్రెస్ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. సీట్ల వ్యవహారం తేలకపోవడంతోనే ఉమ్మడి జిల్లాకు సంబంధించి మొదటి జాబితాలో ప్రకటించాల్సిన స్థానాలను పక్కన పెట్టినట్లు సమాచారం.

కొత్తగూడెం ఖరారా?

కాంగ్రెస్‌తో చర్చల సందర్భంగా సీపీఐ కొత్తగూడెం, మునుగోడు, హుస్నాబాద్, వైరా స్థానాలను కోరగా చివరకు సీపీఐ, సీపీఎంకు రెండేసి స్థానాలను కేటాయించేలా ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరిగింది. అందులో సీపీఐ కోరిన కొత్తగూడెం స్థానం ఉన్నట్లు చెబుతుండగా, ఇంకో సీటుపై స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఇక సీపీఐకి కొత్తగూడెం సీటు కేటాయించారనే ప్రచారం అక్కడి కాంగ్రెస్ నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ స్థానాన్ని కాంగ్రెస్‌కే కేటాయించాలని నాయకులు డిమాండ్ చేస్తుండడమే కాక తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని ఐక్యతారాగం మొదలుపెట్టారు. ఈ స్థానం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సొంత నియోజకవర్గం కావడంతో ఆయన పోటీ చేయాలనే భావనతో ఉండగా.. చివరి వరకు పరిణామాలు ఎలా మారతాయో చూడాల్సి ఉంది.

తేల్చుకోలేక సతమతం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎంకు సీట్ల కేటాయింపు అనుమానాస్పదంగానే కనిపిస్తోంది. ఆ పార్టీకి నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ సీటు కేటాయించేందుకు కాంగ్రెస్ సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, పాలేరు స్థానాలను కూడా కోరుతుండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన పొదెం వీరయ్య అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. సీపీఎం ప్రతిపాదించిన మరో సీటు పాలేరు నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేయాలని ఉత్సాహం చూపుతున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాల్లో ఒకటైన కొత్తగూడెంను సీపీఐకి కేటాయించిందన్న ప్రచారం నేపథ్యాన మరో స్థానాన్ని కాంగ్రెస్ వదులుకోకపోవచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. పాలేరు నుంచి కాంగ్రెస్ తరఫున మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బరిలో ఉండడం దాదాపు ఖరారైందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, మిర్యాలగూడతోపాటు మరో స్థానం కచ్చితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కావాలని సీపీఎం పట్టుబడుతున్నట్లు సమాచారం.

కలిసి నడిచేనా...

కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్య పొత్తు చర్చల దశలోనే ఉండి సీట్లు ఖరారు కాకపోవడం.. కాంగ్రెస్ త్వరలోనే మలి విడత అభ్యర్థుల జాబితా విడుదల చేయనుండడంతో ఉమ్మడి జిల్లాలో ఏయే స్థానాలను కమ్యూనిస్టులకు కేటాయిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ కేటాయించే స్థానాలకు ఆయా పార్టీలు సమ్మతిస్తాయా.. ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి నడుస్తాయా, లేదా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఓవైపు చర్చలు జరుగుతున్నాయని కమ్యూనిస్టు నేతలు, మరోవైపు తాము గెలిచే స్థానాలను కమ్యూనిస్టులు అడుగుతున్నారని కాంగ్రెస్ నాయకులు చెబుతుండడంతో చివరకు ఏం జరుగుతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

నిబంధనలు పటిష్టంగా అమలు చేయండి

- అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశం
- సుజాతనగర్‌లో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్‌బూత్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సుజాతనగర్ : ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై అందజేస్తున్న 3.70 లక్షల రొయ్య పిల్లలను బుధవారం ఆమె సింగభూపాలెం చెరువులో పోశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సరిహద్దుల్లోని తనిఖీ కేంద్రాల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్స్, ర్యాంపులు, విద్యుత్ తదితర వసతులు కల్పించాలని సూచించారు. బీఎల్‌ఓల వద్ద ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించిన ఆమె 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల వివరాలు ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఓటరు జాబితాలో మృతిచెందిన వారి పేర్లు ఉంటే తక్షణమే తొలగించాలని అన్నారు. అనంతరం స్థానిక ఆర్వోబీ వంతెన వద్ద జరుగుతున్న రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించి డిసెంబర్ నాటికి రోడ్డు మార్గాన్ని అందుబాటులోకి తేవాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి వీరన్న, ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈవీఎంలను భద్రపర్చడానికి అన్ని నియోజకవర్గాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. బుధవారం ఆమె కలెక్టరేట్ నుంచి నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 20వ తేదీన ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి 21న అన్ని నియోజకవర్గాలకు పంపనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. సౌకర్యాల విషయంలో తప్పుడు నివేదికలు ఇవ్వొద్దని ఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన వాహనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు రావడానికి వీలుగా వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు నూతన ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో సిసి కెమెరాలు, వీడియో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి విద్యాలత, కమ్యూనికేషన్ ప్రణాళిక నోడల్ అధికారి జినుగు మరియన్న తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- ఇప్పటివరకు రూ.1,24,55,800 స్వాధీనం
- ఎస్పీ వినీత్ వెల్లడి
- పలు చెక్‌పోస్టుల తనిఖీ



బూర్గంపాడు చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ వినీత్

అశ్వారావుపేటరూరల్/బూర్గంపాడు/దమ్మపేట/జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం ఆయన అశ్వారావుపేట మండలం నందిపాడు, అశ్వారావుపేట(ఏపీ సరిహద్దు), బూర్గంపాడు సమీపంలోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద, దమ్మపేట మండలం అల్లిపల్లి, గణేష్‌పాడు, జూలూరుపాడు మండలం వినోభానగర్‌లోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. వాహనాల తనిఖీతో పాటు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమంగా నగదు, మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి వివాదాలు, ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాలో 12 అంతర్రాష్ట్ర సరిహద్దు, మరో 10 అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, వాటి పరిధిలో గత పది రోజుల్లో రూ.1,24,55,800 నగదుతో పాటు రూ.25 లక్షలు విలువైన గంజాయి, రూ.1,77,900 విలువ గల అక్రమ బెల్లం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. చెక్‌పోస్ట్‌ల్లో పనిచేసే సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, సీఐలు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్‌బీ సీఐ నాగరాజు, ఎస్సైలు రాజ్‌కుమార్, నాగభిక్షం, సతీష్, రవి, పి.శ్రీకాంత్, సందీప్, షాహీన, రవి తదితరులు పాల్గొన్నారు.

రెండో జోన్‌కు నీటి సరఫరా నిలిపివేత

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి రెండో జోన్ ఆయకట్టుకు అధికారులు సాగునీటి సరఫరాను బుధవారం నిలిపివేశారు. జిల్లాలోని ఆయకట్టు పరిధిలో వరి పొలాలు ఎండిపోతుండగా రైతుల వినతి మేరకు ఈనెల 8న ప్రభుత్వం సాగర్ నుండి నీటిని విడుదల చేసింది. సాగర్ నుండి పది రోజులపాటు 1.20 టీఎంసీల నీరు పాలేరుకు చేరగా, అక్కడి నుంచి ఆయకట్టుకు వదిలారు. ప్రస్తుతం నీటి విడుదలను నిలిపివేయగా, ఇంకొన్నాళ్లు కొనసాగించాలన్న రైతుల డిమాండ్‌పై అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్



ములకలపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ రమేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ములకలపల్లి/దమ్మపేట/పాల్వంచ : విద్యుత్ బిల్లుల చెల్లింపులో సమస్యల నివారణకు ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు కార్యాలయాలకు రావడం, క్యూలో నిల్చుని బిల్లులు కట్టే విధానానికి స్వస్తి పలికి డిజిటల్ చెల్లింపులపై ప్రజలను చైతన్యం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 38 ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కె.రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఈ కార్యాలయంతో పాటు దమ్మపేట మండలం నాగుపల్లి, ములకలపల్లి, పాల్వంచలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాము నిరవహించిన సదస్సుల్లో 1,860 మంది వినియోగదారులు పాల్గొన్నారని, వీటిని ఇక ముందు కూడా కొనసాగిస్తామని వివరించారు. విద్యుత్ వినియోగదారులు మొబైల్ యాప్, వెబ్‌సైట్‌ల ద్వారా ఎక్కడి నుంచైనా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, దీనిద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పడకుండా ఉంటుందని తెలిపారు. అంతకుముందు కొత్తగూడెంలోని ఎస్‌ఈ కార్యలయం ఎదుట డిజిటల్ చెల్లింపుల అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం డివిజనల్ ఇంజనీర్లు టి. శేషాద్రి, పీఎస్‌వీఎస్ నందయ్య, కె జీవన్ కుమార్, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు లక్ష్మీనర్సింహరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా అమ్మవారి దర్శనం



చిత్రకూట మండపంలో రామాయణ పారాయణం చేస్తున్న పండితులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీతాయారమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన జరిపారు. కాగా, చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో వేద పండితులు, అర్చకులు అరణ్యకాండ పారాయణం చేశారు

నేడు ధాన్యలక్ష్మిగా..

'ధన ధాన్య కరీం.. సిద్ధిం' అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మేనని, అమ్మవారిని ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగు వర్షాలు కురిసి దేశం సస్యశ్యామలంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు.

కనుల పండువగా నిత్యకల్యాణం..

స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

లలితా త్రిపురసుందరీ దేవిగా పెద్దమ్మతల్లి



పాల్వంచరూరల్ : శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి అమ్మవారు బుధవారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతః కాలార్చన, శ్రీలక్ష్మి గణపతి అనుష్టానం, వేద పారాయణం, నవగ్రహ జపాలు, శ్రీ సూక్తం, మన్య సూక్త పారాయణం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్రార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, చండీహోమం, లక్ష కుంకుమార్చన, అశ్వత్థ నారాయణ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడికి సన్మానం



తాటి పున్నమయ్యతో కుటుంబ సభ్యులు

మణుగూరు టౌన్: మండలంలోని విజయనగరం పంచాయతీకి చెందిన తాటి పున్నమయ్యకు 105 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో కుటుంబ సభ్యులందరూ కలిసి బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొడుకులు, కూతుళ్లు, మునిమనువళ్లు, మునిమనవరాళ్లు పచ్చని వనాల నడుమ విందు ఏర్పాటు చేశారు. పున్నమయ్యతో కేక్ కట్ చేయించి వేడుకలు జరిపారు.

బ్యాంక్ అకౌంట్‌లో నగదు స్వాహా

పాల్వంచ: సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్‌లో నగదు స్వాహా చేసిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బొల్లేరుగూడెం ఏరియాకు చెందిన సోమిశెట్టి మహేశ్ సెల్‌ఫోన్‌కు ఈ నెల 7న పాస్‌పోర్ట్ రెన్యూవల్ కోసమని పేర్కొంటూ లింక్ వచ్చింది. లింక్‌ను ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా అకౌంట్‌లో ఉన్న రూ.97 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో లావాదేవీలు చెక్ చేయగా నగదు డ్రా అయినట్లు చూపించడంతో మోసపోయినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు, ఆటో ఢీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నుంచి మణుగూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొట్టిన సంఘటన పట్టణంలోని బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. కాగా ఆటో ముందు భాగం దెబ్బతిన్నది. కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు.

బంగారం చోరీ

ఇల్లెందు: పట్టణంలోని రామ్మోహన్ మెడికల్ షాపులో రెండున్నర తులాల బంగారు ఆభరణం, రూ. 2 వేల నగదు చోరీకి గురైందని బాధితుడు రామోహ్మన్ తెలిపాడు. మరమ్మతుల కోసం బ్రాస్‌లెట్ తీసి మెడికల్ షాపులో పెట్టగా చోరీ జరిగినట్లు పేర్కొన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బుధవారం తెలిపాడు.

రైల్వే ట్రాక్ మీద పడి వ్యక్తి మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు పంచాయతీలోని రైలు పట్టాలపై పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామునజరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గాదె నాగరాజు (40) అనే వ్యక్తి ముర్రేడు వాగు బ్రిడ్జిపై రైల్వే ట్రాక్ మీద ఉన్న టెలిఫోన్ వైర్ చోరీ చేసే క్రమంలో జారి రైలు పట్టాలపై పడ్డాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డోర్నకల్ రైల్వే ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌కు ఉద్యోగ అవకాశం

ఖమ్మం సహకారనగర్: సామాన్య పౌరులతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పనలో అవకాశాలు ఇచ్చి సమాజంలో సముచిత స్థానం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆఫీసు సబార్డినేట్ పోస్టుకు గట్టుసింగారం గ్రామ వాసి ప్రస్తుతం వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న బత్తుల వీరన్న – లక్ష్మి దంపతుల కుమార్తె(ట్రాన్స్‌జెండర్) శ్రీవాణి దరఖాస్తు చేసుకుంది. ఆమె తనను సంప్రదించగా విద్యార్హత ఆధారంగా ఆఫీసు సబార్డినేట్‌గా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

ఖమ్మం లీగల్/నేలకొండపల్లి: ఒకరి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ ఖమ్మం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఆశారాణి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన షేక్ అఫ్జల్ బీ భర్త ఖాసిం సాహెబ్‌కు, నల్లమల రామారావు నడుమ అప్పు విషయమై వివాదం జరిగింది. ఖాసింను రామారావు దూషిస్తూ బ్రతికే బదులు మందు తాగి చావొచ్చు కదా అని రామారావు అన్నాడు. ఈంతో మనస్తాపానికి గురైన ఖాసిం సాహెబ్ 2020 జనవరి 8న పురుగుల మందు తాగగా నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మంకు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ అదేనెల 14న మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసును విచారణ అనంతరం నిందితుడురామారావుపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా, వి.భద్రునాయక్, మోహన్‌రావు, ఓ.శ్రీనివాసరావు, ఎం.రామారావు సహకరించారు.

విలువిద్యలో క్రీడాకారుల ప్రతిభ

- ఉమ్మడి జిల్లా ఆర్చరీ జట్ల ఎంపిక
- ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు



ఆర్చరీ ఎంపిక పోటీల్లో విల్లు ఎక్కు పెట్టిన క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని క్రీడాకారులు విలువిద్యలో ప్రతిభ చూపుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జట్లను ఎంపిక చేశారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్, సబ్ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి బాలుర విభాగంలో 50 మంది, బాలికల విభాగంలో 25 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సీనియర్స్ విభాగంలో మహిళలు, పురుషుల జట్లకు 12 మంది, సబ్ జూనియర్స్ విభాగంలో బాలబాలికల జట్లకు 12 మందిని చొప్పున మొత్తం 24 మందిని ఎంపిక చేశారు. ఎంపిక పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి జిల్లా క్రీడాకారులు ఆర్చరీలో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది జరిగిన సీఎం కప్ పోటీల్లో బంగారు పతకం గెలిచారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జట్లు ఈ నెల 21, 22వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు హాజరవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మారప్ప, పి.ప్రసాద్, టి.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ఇప్పటికే జిల్లాలోని పలువురు క్రీడాకారులు విలువిద్యలో అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరికొందరు కూడా ఆ స్థాయికి చేరుకుంటారు. ఎంపికలకు విశేష స్పందన లభించింది.

–పుట్టా శంకరయ్య, ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి

నాకు చాలా ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి విలువిద్య అంటే చాలా ఇష్టం. అందుకే ఆర్చరీని ఒక క్రీడా అంశంగా ఎంచుకుని రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాను. కొత్తగూడెంలో జరుగుతున్న జిల్లా ఆర్చరీ జట్టు ఎంపికల పోటీలకు రావడం ఆనందంగా ఉంది.

–పాయం నగేష్, ఆళ్లపల్లి

పతకం సాధించాలని..



రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని పతకం సాధించాలనేది నా లక్ష్యం. కోచ్‌ల సహాయంతో మెలుకువలు నేర్చుకుంటున్నాను. లక్ష్యంపై గురిపెట్టి విజయం సాధించేందుకు కృషి చేస్తాను. ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

–కె.లక్ష్మణ్, కొత్తగూడెం

జిల్లా జట్టుకు ఎంపికైంది వీరే...



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: కొత్తగూడెంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా ఆర్చరీ జట్లను ఎంపిక చేశారు. సీనియర్స్ పురుషుల ఇండియాన్ రౌండ్‌లో కె.లక్ష్మణ్, కె.పృథ్వీ, పి.నగేష్, కె.సర్వేష్, బి.అనిల్, సీహెచ్ వంశీ, మహిళల విభాగంలో పి.నిరోషా, జె.సంస్కృతి, రికర్వ్ ఈవెంట్‌లో టి.శేఖర్, డి.దేవక్‌సాయి, మహిళల విభాగంలో సీహెచ్.నైమిషా రాజ్, సీహెచ్.ఔచిత్యను ఎంపిక చేశారు. అలాగే, జూనియర్స్ బాలుర ఇండియాన్ రౌండ్‌లో కె.లక్ష్మణ్, కె.సర్వేష్, బి.అనిల్, ఈ.ఆనంద్, పి.ప్రవీణ్, వి.వంశీర విరాజు దొర, బాలికల విభాగంలో షేక్ హస్న, ఎం.మధుప్రియ, కె.నదియా, టి.జమునరాణి, ఎం.గౌతమి, జె.సంస్కృతిని ఎంపిక చేయగా, వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.

సువిధతో సులభంగా..!

- ఆన్‌లైన్‌లో ఎన్నికల అనుమతులు
- సభలు, సమావేశాల దరఖాస్తుకు అవకాశం
- ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వ మైదానాలు, గెస్ట్‌హౌస్‌లు..
- 48గంటల ముందు దరఖాస్తు తప్పనిసరి



ఖమ్మం సహకారనగర్: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో అమలుచేస్తోంది. తద్వారా పార్టీల అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతుండగా.. యంత్రాంగానికి సైతం పని సులువవుతోంది. అలాగే, ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నారా, లేదా అనేది ఎన్నికల సంఘం అధికారులకు ఎక్కడి పర్యవేక్షించే వీలు కలగనుంది.

సువిధ యాప్

ఎన్నికల సందర్భంగా అనుమతుల కోసం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనను మరింత సులభతరం చేసేందుకు ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్కడి నుంచైనా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడం పార్టీలకు కలిసొస్తుందని చెబుతున్నారు. అలాగే, అధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు జారీ చేయొచ్చు. ఈమేరకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై యాప్‌ను సద్వినియోగం చేసుకునేలా సూచనలు చేశారు.

24గంటల్లోగా అనుమతి

ఎన్నికల సమయంలో అభ్యర్థులు, పార్టీల నాయకులకు ప్రతీ నిమిషం విలువైనదనే చెప్పాలి. ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాల నిర్వహణకు అవసరమైన మైదానాలకు అనుమతి తీసుకోవాలి. అలాగే, ప్రచార ర్యాలీలు, ప్రదర్శనలతో పాటు వాహనాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్ స్పీకర్లు, హెలీకాప్టర్లు, హెలీప్యాడ్ల వినియోగానికి అనుమతి తీసుకోవాల్సి ఉండగా.. లేకపోతే అధికారులు సీజ్ చేసే అవకాశముంది. ఈమేరకు సువిధ యాప్ ద్వారా 48గంటల ముందు దరఖాస్తు చేసుకుంటే అన్నీ పరిశీలించి 24గంటల్లోగా నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు అనుమతి జారీ చేస్తారు. కాగా, ప్రతీ అనుమతి ఏడు రోజులే అమల్లో ఉంటుందని.. దీన్ని పొడిగించుకోవాలనుకుంటే మళ్లీ 48గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ముందు వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యత

సభలు, సమావేశాల నిర్వహణకు ఒకేరోజు ప్రభుత్వ మైదానం, గెస్ట్‌హౌస్ కావాలని రెండు పార్టీల వారు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. అలాంటప్పుడు ముందు దరఖాస్తు చేసుకున్న వారికే కేటాయిస్తారు. కాగా, సువిధ యాప్ అమల్లోకి రావడంతో అభ్యర్థులు, నాయకులకు పని సులువవుతుందని చెబుతున్నారు. అధికారులు, కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిన బాధ తప్పుతుందని.. త్వరగా అనుమతులు జారీ అవుతాయనే భావన వ్యక్తమవుతోంది. కాగా, ఇప్పటివరకు సువిధ ద్వారా పెద్దగా దరఖాస్తులు అందు కున్నా.... దసరా తర్వాత పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తాయని తెలుస్తోంది.

దరఖాస్తులు ఇలా...

అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు suvidha.eci.gov.in వెబ్‌సైట్‌లో ఫోన్ నెంబర్ ద్వారా తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆతర్వాత పూర్తి వివరాలు, నియోజకవర్గం, రాష్ట్రం అన్ని వివరాలను సమర్పించి వారికి కావాల్సిన అనుమతి దరఖాస్తు చేసుకోవాలి.

బీఆర్ఎస్ మేనిఫెస్టోకు బ్రహ్మరథం

ఎంపీ నామ నాగేశ్వరరావు



ఎంపీ నామతో ఎమ్మెల్సీ మధు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల బీఆర్ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పార్టీ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన కారేపల్లి మండలం ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎంతో దూరదృష్టితో మేనిఫెస్టో రూపొందించారని పేర్కొన్నారు. ఇందులో అంశాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం చేయడం ద్వారా వైరా బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ విజయానికి బాటలు వేయాలని కోరారు. నేతల మధ్య ఉన్న చిన్నచిన్న అభిప్రాయబేధాలు ఉంటే వదిలి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. మదన్‌లాల్ గెలుపు ఇప్పటికే ఖాయమైపోగా, మంచి మెజార్టీ కోసం శ్రమించాలని తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలకు వారంటీ లేదని, ఆ పార్టీ నేతలను విశ్వసించాల్సిన అవసరం లేదని ఎంపీ చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, వైరా అభ్యర్థి బానోత్ మదన్‌లాల్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఎంపీపీ శకుంతల, సర్పంచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి బైండోవర్

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెం, కరివారిగూడెం, సురారం గ్రామాలకు చెందిన ఏడుగురు బెల్ట్ షాపు నిర్వాహకులను ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ శారద ఎదుట బైండోవర్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐ సాయి కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: మద్యానికి బానిసైన ఓ యువకుడు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్డులో అద్దెకు ఉంటున్న సూడిశెట్టి మహేష్(24) మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్ కొక్కానికి చీరతో ఉరి వేసుకున్నారు. ఈమేరకు సమాచారంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

రాహుల్, ప్రియాంకను కలిసిన పొంగులేటి



రాహుల్‌గాంధీని సన్మానిస్తున్న పొంగులేటి..



ప్రియాంకను సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

ములుగు జిల్లాలో బుధవారం ప్రారంభమైన కాంగ్రెస్ విజయభేరి బస్సుయాత్రకు కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ములుగులో జరిగిన సభలో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని పొంగులేటి సత్కరించారు. – ఖమ్మంవన్‌టౌన్

రూ. 7.84 లక్షల నగదు సీజ్



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



పట్టుబడ్డ నగదును చూపిస్తున్న ఎస్సై షాహీన

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా రూ.7.84 లక్షల నగదును సీజ్ చేశారు. అశ్వారావుపేట మండలంలో ఏపీ సరిహద్దున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద బుధవారం రెండు ఘటనల్లో రూ.3.58 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొత్తూరు చెక్‌పోస్టు వద్ద ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందిన గుగులోతు యాకూబ్ వద్ద నుంచి రూ.లక్షా 15 వేల రూపాయలు పట్టుకున్నారు. అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర ఏపీలోని తాడేపల్లిగూడెం నుంచి కల్లూరు వెళ్తున్న అత్యం కీర్తి కారులో రూ.2.43లక్షలు గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ పి.శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు.

టేకులపల్లిలో రూ. 2 లక్షలు

టేకులపల్లి: టేకులపల్లి డబుల్ బెడ్ రూం కాలనీ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పోలీసులు బుధవారం రూ. 2 లక్షల నగదు పట్టుకున్నారు. కోయగూడెం గ్రామానికి చెందిన వ్యాపారి అనబత్తుల రామకోటేశ్వర్‌రావు కుమారుడు నాగకృష్ణ బైక్ నుంచి స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం–3 ఇన్‌చార్జ్ పి.వాసవీ రాణికి అప్పగించినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపారు.

అన్నపురెడ్డిపల్లిలో రూ.90 వేలు..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని బూర్గుడెం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రూ.90 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. తిరువూరు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న వ్యక్తి నగదు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై షాహీన తెలిపారు.

భద్రాచలంలోరూ.70 వేలు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం మీదుగా విజయవాడకు తరలిస్తుండగా సీజ్ చేశారు.

ములకలపల్లిలో రూ.66 వేలు..

ములకలపల్లి: కంపగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ.66,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి బుధవారం తెలిపారు. సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి స్వాధీనపరిచినట్లు పేర్కొన్నారు.

నిరంతర నిఘా..

- సరిహద్దులో తనిఖీలు ముమ్మరం
- ఎన్నికల కోడ్ పక్కాగా అమలు
- చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీ
- రూ. 50 వేలు దాటితే ఆధారాలు చూపాల్సిందే..



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది

భద్రాచలం అర్బన్ : నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న భద్రాచలంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భద్రాచలానికి అధిక సంఖ్యలో వాహనాలు వస్తుండడంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా చర్యలు చేపడుతున్నారు. నోడల్ అధికారులు, పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. సాధారణ వ్యక్తులైనా సరే.. వ్యాపారం, ఆస్పత్రి, వ్యవసాయ అవసరాలు, పెళ్లిళ్ల షాపింగ్, సరుకుల కొనుగోలు వంటి వాటికి బయటకు వెళితే రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే దానికి సంబంధించిన ఆధారాలు చూపించాలని అంటున్నారు. బ్యాంక్ నుంచి డబ్బు డ్రా చేసినా సంబంధిత రసీదు, ఏటీఎం నుంచి వచ్చిన రసీదు, ఇతరుల నుంచి అప్పుగా తీసుకుంటే ఆ పత్రాన్ని అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

నాలుగు చెక్‌పోస్టులు..

భద్రాచలంలో ప్రస్తుతం ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌తో పాటు ఒక మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్ పని చేస్తోంది. త్వరలో మరో ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఎస్ఎస్టీ(స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్)ను నియమించనున్నారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్ట్, రాజుపేట వద్ద ఒకటి, ఆర్టీఏ కార్యాలయం వద్ద ఒకటి, ఐటీడీఏ రోడ్డులో మరో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద టీమ్‌లు షిఫ్టుల వారీగా 24 గంటలూ విధులు నిర్వర్తిస్తున్నాయి. ఇక చెక్‌పోస్టులతో పాటు ప్రధాన రహదారులు, చౌరస్తా, జనావాసాలు ఎక్కువగా ఉండే చోట అధికారులు ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

9 రోజుల్లో రూ. 9.20 లక్షలు పట్టివేత

ఎన్నికల కోడ్ సందర్భంగా భద్రాచలంలో ఏర్పాటు చేసిన నాలుగు చెక్‌పోస్టుల వద్ద గత తొమ్మిది రోజులుగా పోలీసులు తనిఖీలు విస్తృతం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.9.20లక్షల నగదును సీజ్ చేశారు. మరి కొందరి వద్ద తగిన ఆధారాలు ఉండడంతో వదిలేశారు.

24 గంటలూ తనిఖీలు చేస్తున్నాం



భద్రాచలంలో నాలుగు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలూ తనిఖీలను నిర్వహిస్తున్నాం. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచాం. చౌరస్తాలు, ప్రధాన రోడ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని, వ్యక్తులను తనిఖీ చేసి వివరాలు సేకరిస్తున్నాం.

–పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ

రీజియన్ నుంచి 695 ప్రత్యేక బస్సులు

ఆరు డిపోల పరిధిలో ఏర్పాటు

ఖమ్మం మయూరిసెంటర్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా స్వస్థలాలకు వెళ్లివచ్చే ప్రయాణికుల కోసం ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల నుండి 695 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఇందులో ఖమ్మం నుండి హైదరాబాద్, భద్రాచలం, విజయవాడ తదితర రూట్లలో అదనపు బస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

దసరా లక్కీ డిప్

ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించే వారి కోసం దసరా లక్కీ డిప్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం వెంకన్న తెలిపారు. ఈనెల 30 వరకు ప్రయాణించిన వారు తమ టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్ రాసి బస్టాండ్లలోని బాక్సుల్లో వేయాలని సూచించారు. పండుగ అనంతరం రీజియన్‌లో ఐదుగురు చొప్పున పురుషులు, మహిళలను ఎంపిక చేసి రూ.9,900 నగదు బహుమతులు అందిస్తామని వెల్లడించారు. ఇందుకోసం ఖమ్మం కొత్త బస్టాండ్‌తో పాటు సిటీ బస్టాండ్, మధిర, తల్లాడ, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, వీఎం బంజర, కల్లూరు, భద్రాచలం, వెంకటాపురం, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు క్రాస్ రోడ్డుతో పాటు ,మణుగూరులోని సురక్ష బస్టాండ్లలో లక్కీ డిప్ బాక్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

తాలిపేరు ప్రధాన కాల్వ గండి పూడ్చివేత

సాగునీరు విడుదల చేసిన అధికారులు



ఎడమకాల్వ ద్వారా విడుదలవుతున్న సాగునీరు

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాల్వకు కుదునూరు సమీపాన పడిన గండిని పూడ్చివేశారు. ఇక్కడ ఆదివారం మధ్యాహ్నం గండి పడగా, ఇరిగేషన్ డీఈ తిరుపతి ఆధ్వర్యాన సోమవారం ఉదయం నుంచి పూడ్చివేత పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తికావడంతో బుధవారం ఉదయం నుంచి ప్రధాన కాల్వకు సాగునీటి విడుదలను పునరుద్ధరించారు. దీంతో సుమారు 18 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన అధికకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎప్పుడో ప్రవేశపెట్టి ఉండాల్సింది..





క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు

- ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానంపై క్రీడాకారులు
- తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంత క్రికెటర్లకు ప్రయోజనమని వెల్లడి
- మహిళా జట్లకూ స్థానం కల్పిస్తే బాగుంటుందన్న పలువురు...

ఖమ్మం స్పోర్ట్స్: ఒలింపిక్స్‌ను ప్రతీ దేశంలో జరిపేలా నిర్ణయించే సమయానికి క్రికెట్ కూడా ప్రాచుర్యంలోనే ఉంది. ఇప్పుడు ప్రపంచకప్ పోటీల నిర్వహణ స్థాయికి చేరింది. తద్వారా ఒలింపిక్స్, ఇటు క్రికెట్‌కు సమాన చరిత్ర ఉందని చెబుతారు. ఈ నేపథ్యాన ఒలింపిక్ క్రీడల్లో ఆలస్యంగానైనా క్రికెట్‌కు స్థానం కల్పించడంపై క్రీడాకారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు మొదలుకానున్నాయి. భారత్‌తో పాటు ఇప్పటికే క్రికెట్ ఆడుతున్న దేశాలకు తోడు మరిన్ని దేశాలకు అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. అయితే, తొలుత గ్రామీణ ప్రాంతాల్లోకి క్రికెట్‌ను తీసుకెళ్లేలా బీసీసీఐ కృషి చేయాలని.. తద్వారా అన్నిప్రాంతాల నుంచి క్రీడాకారులు వెలుగులోకి వస్తారనే భావన వ్యక్తమవుతోంది. తాజాగా ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేరుస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యాన జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్లు, ఔత్సాహికులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

బీసీసీఐ మరింత చొరవ చూపాలి



పాశ్చాత్య దేశాల్లో క్రికెట్‌పై మంచి అవగాహన ఉంది. భారత్‌లో కూడా యువతను ప్రోత్సహిస్తూ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా బీసీసీఐ కృషి చేయాలి. ఇందులో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సత్తా చాటుతున్న క్రికెటర్లకు స్థానం కల్పిస్తే బాగుంటుంది. ఈవిషయంలో ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి.

– కె.నర్సింహమూర్తి, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి

రంజీ టోర్నీలపై దృష్టి సారిస్తేనే...



ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలంటే తొలుత రంజీ టోర్నీల్లో రాణించాలి. కేవలం హెచ్‌సీఏ నిర్వహించే లీగ్ మ్యాచ్‌ల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. రంజీ మ్యాచ్‌లకు సెలక్ట్ అయ్యేలా ప్రాక్టీస్ చేస్తే రాణించొచ్చు. ఆతర్వాత సెలక్టర్ల దృష్టిలో పడి.. ఇంకా ప్రాక్టీస్ చేస్తే ఒలింపిక్స్‌కు జట్టులో స్థానం లభిస్తుంది.

– వై.సాయిచంద్, సీనియర్ క్రికెటర్

50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడించాలి



ఇటీవల ఆసియా క్రీడల్లో నిర్వహించిన 50 ఓవర్ల మ్యాచ్‌ల మాదిరే ఒలింపిక్స్‌నూ నిర్వహించాలి. 20ఓవర్ల మ్యాచ్‌లైతే బెట్టింగ్‌కు ఆస్కారముంటుంది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడంతో చిన్న దేశాల క్రీడాకారులు కూడా వెలుగులోకి వస్తారు. తద్వారా దీన్ని ప్రపంచ వ్యాప్త ఆటగా పరిగణిస్తారు.

– ఎం.డీ.మసూద్ పాషా, క్రికెట్ అసోసియేషన్ కోఆర్డినేటర్

స్పాన్సర్లు ముందుకు రావాలి



ప్రతీ జిల్లా కేంద్రంలో క్రికెటర్లను ప్రోత్సహించేలా స్పాన్సర్లు ముందుకు రావాలి. అప్పటివరకు తగిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలి. తద్వారా ప్రతిభ కలిగిన క్రికెటర్లకు ప్రోత్సాహం లభించి వెలుగులోకి వస్తారు. జిల్లా కేంద్రాల్లోనూ కోచ్‌లు, కిట్లు సమకూర్చి మెరుగైన శిక్షణ ఇప్పించాలి.

– ఎస్.కే.ఫరీద్, క్రికెటర్, కేఎండీసీ

ఎప్పుడో అమలుచేయాల్సింది..



యాభై ఏళ్ల క్రితమే ఒలింపిక్స్‌ల్లో క్రికెట్ ప్రవేశపెడితే బాగుండేది. ఏదిఏమైనా కొన్ని దేశాలకే పరిమితమైన క్రికెట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వకారణం. ఎన్నో క్రీడలను గతంలోనే ఒలింపిక్స్‌ల్లో చేర్చారు. ఇప్పుడు క్రికెట్‌నూ చేర్చిన నేపథ్యాన క్రీడాకారులను ప్రోత్సహించినట్లవుతుంది.

– జి.వీరేష్‌గౌడ్, సీనియర్ క్రికెటర్, కోచ్

మహిళా జట్లకూ అవకాశం ఇవ్వాలి...



ఒలింపిక్స్ క్రీడల్లో మహిళల క్రికెట్‌ను కూడా ప్రవేశపెడితే బాగుంటుంది. తద్వారా నాలాంటి వారికి అవకాశాలులభిస్తాయి. ఇప్పుడు సీరియస్ ప్రాక్టీస్ చేస్తున్నా. సీనియర్ మహిళా క్రికెటర్లను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనేలా తర్ఫీదు పొందుతున్నాను.

– బి.యమున, ఔత్సాహిక క్రికెటర్

కోచ్‌లను నియమించాలి..



ఒలింపిక్స్‌ల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టగానే సరిపోదు. క్రికెట్ ఆదరణ కలిగిన కేంద్రాల్లో విధిగా క్రికెట్ కోచ్‌లను నియమించాలి. ఎన్ఐఎస్ శిక్షణ చేసిన వారినే నియమిస్తే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రికెటర్లు పుట్టుకొస్తారు. అలాగే, క్రికెట్‌ను గ్రామీణ ప్రాంతాల్లోని తీసుకెళ్లేలా మరిన్ని చర్యలు చేపట్టాలి.

– ఎం.డీ.మతిన్, నెట్స్ క్రికెట్ కోచ్

2028లో స్వర్ణ పతకం మనదే...



2028లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు స్థానం కల్పిస్తారు. మొదటి సారే మన జట్టు స్వర్ణ పతకం దక్కించుకోవడం ఖాయం. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. మన జట్టు జట్టు ఇలాగే కొనసాగితే 2028 నాటికి ప్రపంచంలోనే మేటిగా, ఇతర జట్లను ఢీకొట్టే జట్టుగా నిలవడం సులభమే.

– ఎస్.కే.అజహర్, సీనియర్ క్రికెటర్

నష్టాల నుంచి లాభాల్లోకి డీసీసీబీ

- బ్యాంకు ఛైర్మన్ కూరాకుల నాగభూషణం
- జీఎం నర్మదకు సీఈఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ నాగభూషణం, పక్కన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: సుమారు రూ.7.50కోట్ల నష్టాల్లో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ను మూడేళ్ల కాలంలో రూ.22 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామని ఛైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సీఈఓ (ముఖ్య కార్యనిర్వహణాధికారి) అట్లూరి వీరబాబు ఉద్యోగ విరమణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఈఓ, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా బ్యాంకు అభివృద్ధి పథంలో కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు 90 మంది ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వగా, కొత్తగా 50 మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. అలాగే, రాష్ట్ర విభజనతో ఏపీలోని కూనవరం, కుక్కునూరు బ్రాంచ్‌లను భద్రాద్రికొత్తగూడెం జిల్లా సారపాక, అన్నపురెడ్డిపల్లికి తరలించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, నిర్మల పుల్లారావు, చావా వేణు, వేముల శ్రీనివాసరావు, నూకల సైదులు, కోరం జానకీరావు, జిల్లా సహకార అధికారి కె.విజయకుమారి, ఎస్‌డీఓఆర్‌ఎస్‌డీ వెంకటేశ్వర్లు, బ్యాంకు జనరల్ మేనేజర్ కె.నర్మద, డీజీఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సీఈఓగా నర్మద

డీసీసీబీ సీఈఓ వీరబాబు ఉద్యోగ విరమణ చేయడంతో జనరల్ మేనేజర్ కె.నర్మదకు ఇన్‌చార్జ్ బాధ్యతలను పాలకవర్గం అప్పగించింది. ఇప్పటికే టస్కాబ్ ఆధ్వర్యాన సీఈఓ నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. త్వరలోనే పోస్టు భర్తీ చేయనుండగా అప్పటివరకు నర్మద బాధ్యతలు నిర్వర్తిస్తారు.

అడవిని కాపాడుతూ జీవనోపాధి పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో జీవిస్తున్న ఆదిమ గిరిజన తెగల(పీవీటీజీ) ప్రజలు అటవీ ప్రాంతాన్ని కాపాడుతూనే జీవనోపాధి పొందాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం సామూహిక అటవీ గుర్తింపు హక్కు పత్రాలు పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొనగా పీఓ మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు ఆదిమ గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా పీవీటీజీలకు అటవీ ప్రాంతాల్లో లభించే తేనె, వెదురు, జిగురుతోపాటు వివిధ వస్తువులతో లబ్ధి జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, పీ.వీ.సురేష్‌బాబుతోపాటు ఉమ్మడి జిల్లాలోని అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్లకు కిట్లు పంపిణీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఇటీవల ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ అండర్–17 బాలబాలికల జట్లను ఎంపికచేశారు. ఈమేరకు జట్లకు బుధవారం గూడూరు కోటిరెడ్డి, బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో కిట్లు అందజేశారు. కాగా, జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.గోవిందారెడ్డి, కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, పీడీలు జి.శ్యాంబాబు, హరి, పి.వీరరాఘవయ్య, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



బాలుర వాలీబాల్ జట్టుతో కార్యదర్శి, కోచ్‌లు

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 52
» పోస్టుల వివరాలు: ఫిజియోథెరపిస్ట్–02, స్టాఫ్ నర్స్–24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్–08, మెడికల్ ఆఫీసర్–10, ఎల్‌జీఎస్–04, సపోర్టింగ్ స్టాఫ్–03, సెక్యూరిటీ గార్డ్–01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.10.2023.
» వెబ్‌సైట్: krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 56
» పోస్టుల వివరాలు:ఫార్మసిస్ట్ గ్రేడ్2–02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–02, రేడియోగ్రాఫర్–01, థియేటర్ అసిస్టెంట్–08, ల్యాబ్ అటెండెంట్–02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్–03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో–28, ఆఫీస్ సబార్డినేట్–01, ప్లంబర్–05, ఎలక్ట్రీషియన్–01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 21.10.2023.
» వెబ్‌సైట్: ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.10.2023.
» వెబ్‌సైట్: prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» పోస్టుల వివరాలు: ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్–05, ఆఫీస్ సబార్డినేట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 25.10.2023.
» వెబ్‌సైట్: https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్టులకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్టులు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–145 పోస్టులు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్– 42 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–74 పోస్టులు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–3 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–జనరల్ రిక్రూట్‌మెంట్–25 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–49 పోస్టులు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్టులు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ▪ ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600–రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్–బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమోద్దైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:అక్టోబర్ 29,2023
- రాత పరీక్ష తేదీ: డిసెంబర్ 3, 2023
- రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో.
- వెబ్‌సైట్: www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.